అధ్వానంగా గ్రీన్‌బెల్ట్

- ఆక్రమించేసి వాహనాల పార్కింగ్
- కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలాపాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



గ్రీన్‌బెల్ట్ స్థలంలో పిచ్చి మొక్కలు



సత్యం జంక్షన్ నుంచి గురుద్వార్‌కు వెళ్లే మార్గంలో గ్రీన్‌బెల్ట్‌లో ఇంటి సెంట్రింగ్ సామగ్రి



గురుద్వార సమీపంలోని గ్రీన్‌బెల్ట్‌లో వాహనాల పార్కింగ్

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలో గల గ్రీన్‌బెల్టు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా... అందులో పచ్చదనం కనుమరుగవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే పలు ప్రాంతాల్లోని గ్రీన్‌బెల్టు స్థలాలు నామరూపాలు లేకుండా పోయాయని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని సత్యం జంక్షన్, గురుద్వారా, అక్కయ్యపాలెం, నరసింహనగర్, రేసపువానిపాలెం తదితర ప్రాంతాల్లోని గ్రీన్‌బెల్టు స్థలాలను కొందరు వ్యక్తులు దర్జాగా ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. గురుద్వారా సమీపంలో గల గ్రీన్‌బెల్టు స్థలాలను పూర్తిగా చదును చేసి అక్కడి షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా వాహనాల పార్కింగ్ కోసం దర్జాగా వినియోగిస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో జాతీయ రహదారికి ఇరువైపులా గల స్థలాల్లో పచ్చదనం పెంపొందించడానికి గ్రీన్‌బెల్టు స్థలాలు అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆయా ప్రాంతాల్లోని గ్రీన్‌బెల్టు చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. కాలక్రమంలో పలు చోట్ల ఆ స్థలాలు ఆక్రమణకు గురికావడం గమనార్హం.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

గతంలో గ్రీన్‌బెల్ట్ స్థలాలు ఆక్రమణకు గురైతే వైఎస్సార్ సీపీ పాలనలో మళ్లీ కొత్తగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. దీంతో ఆక్రమణదారులు వెనక్కు తగ్గారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఆరు నెలల్లో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. రేసపువానిపాలెం, గురుద్వారా, అక్కయ్యపాలెం, తదితర ప్రాంతాల్లో గల గ్రీన్‌బెల్టు స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. మరోవైపు ఈ ప్రాంతాల్లో సాయంత్రం కాగానే చీకటి పడితే అసాంఘిక శక్తులు చేరిపోయి మద్యం, గంజాయి సేవిస్తూ అటుగా వెళ్లే వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. స్థానికులు ఆయా మార్గాల్లో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించాలంటే భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు రోజూ తెల్లవారేసరికి ఆయా ప్రాంతాల్లో మద్యం సీసాలు, చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేసపువానిపాలెంను ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్టు స్థలాన్ని కొందరు ఆక్రమించి గేదెలను కడుతున్నారు. వీరు ఇక్కడి చెత్త, వ్యర్థాలకు తరచూ నిప్పు పెట్టడంతో సమీపంలోని ఇళ్లలోకి దట్టమైన పొగ రావడంతో ఊపిరి అందడం లేదని స్థానిక నివాసులు వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే శాపం

గ్రీన్‌బెల్ట్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా... ఆ స్థలాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా ఇప్పటి వరకూ జోన్ – 3 టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు కన్నెత్తి చూడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా స్థానిక సచివాలయాల్లోని టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు కూడా ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, కార్యదర్శుల నిర్లక్ష్యం వెరసి గ్రీన్‌బెల్టు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులు స్పందించి జోన్ – 3 పరిధిలో గల గ్రీన్ బెల్టు స్థలాలను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



గ్రీన్ బెల్ట్ స్థలంలో నిలిపిన వాహనాలు

ఆక్రమణలు తొలగించాలి

జోన్ – 3 పరిధిలో పలుచోట్ల గ్రీన్‌బెల్టు స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. ఫలితంగా పచ్చదనం కనుమరుగవుతోంది. ఇప్పటికే పర్యావరణం దెబ్బతింటోంది. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి వెంటనే ఆక్రమణలు తొలగించాలి. గ్రీన్‌బెల్టు స్థలాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి.

– మాధవి, రేసపువానిపాలెం.

పచ్చదనం మాయం

జోన్ – 3 పరిధిలోని గురుద్వారా, తదితర ప్రాంతాల్లో కొందరు గ్రీన్‌బెల్టు స్థలాల ఫెన్సింగ్ తొలగించి వ్యాపారాలు చేస్తున్నారు. ఫలితంగా పచ్చదనం మాయమైపోయింది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్రీన్‌బెల్టు స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– అప్పారావు, గురుద్వారా.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అల్లిపురం: ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి ద్వారకాబస్టేషన్ ఇన్‌గేట్ దరి సులభ్ కాంప్లెక్స్ వద్ద విజయనగరం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డు దాటుతున్న సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తిని ఢీకొంది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీలక్ష్మి అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ వ్యక్తి ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు.

క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం



అక్కయ్యపాలెంలో వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న పీలా వెంకటలక్ష్మి

సీతంపేట : వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ విభాగం మహిళా అధ్యక్షురాలు పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కయ్యపాలెంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు మధ్యాహ్నం భోజనం అందజేశారు. స్వయంగా భోజనం వడ్డించి పండ్లు అందజేశారు.

- వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పుట్టిన రోజు సందర్భంగా 14వ వార్డు పరిధి పాపా హోమ్‌లో, 49వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో గల వానప్రస్త వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అలరించిన హాస్య వల్లరి



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట : విశాఖ హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం హాస్యవల్లరి పేరిట ప్రదర్శించిన కామెడీ స్కిట్స్ ఆద్యంతం నవ్వులు పండించాయి. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రావి గోపీకృష్ణ, ఎస్.ఎస్.రామానుజం నేతృత్వంలో క్లబ్ కళాకారులు భానుప్రకాష్, ఆర్ఎస్ఎన్ మూర్తి, డీఎస్ఎన్ మూర్తి, నాగ గణేష్, శివజ్యోతి ప్రదర్శించిన స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో సినిమా టిక్కెట్లు, మీరు చాలా అందంగా ఉన్నారు, కేసు గెలిచా, షాపింగ్‌మాల్ అమ్మ, తాగుబోతు బిచ్చగాడు, గండభేరుండం స్కిట్స్ చక్కటి హాస్యాన్ని పండించాయి. ఇటీవల కీర్తిశేషులైన బాదంగీర్ సాయి, చింతా ప్రభాకర్ ఆత్మలు శాంతించాలని క్లబ్ సభ్యులు మౌనం పాటించారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



విశేష పూజలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాలు 7వ రోజు ఆదివారం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు జరిపారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు సర్వదర్శనం, 6 నుంచి రాత్రి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ జరిపారు. త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

మండపంలో వైదిక కార్యక్రమాలు..

ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శ్రీచక్రనవావర్ణార్చన, లక్ష్మీహోమం, మార్గశిర మాస విశేష కుంకుమార్చన, అష్టోత్తర కుంకుమార్చనలు, వేదపారాయణ భక్తిశ్రద్ధలతో జరిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు మార్గశిర మాస విశేష కుంకుమార్చనలు చేశారు. మధ్యాహ్న వందలాది మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న గాంధీ సెంటర్ అధ్యక్షుడు బాలమోహన్‌దాస్

సీతంపేట : మానవ హక్కుల పరిరక్షణకు రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతోపాటు ఆదేశ సూత్రాలకు కూడా పూర్తి స్థాయిలో చట్టబద్ధత కల్పించాల్సిన అవసరం ఉందని గాంధీ సెంటర్ అధ్యక్షుడు వి.బాలమోహన్‌దాస్ అన్నారు. బీవీ ఫౌండేషన్, ఐఏఆర్ఎఫ్ సంస్థల ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో మానవ హక్కుల దినోత్సవ ప్రత్యేక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా సందర్భాల్లో హక్కుల పరిరక్షణ సాధ్యం కావడం లేదన్నారు. యువతకు హక్కులపై అవగాహన కల్పించడం అవసరమన్నారు. బీవీ ఫౌండేషన్ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ గౌరవం, స్వేచ్ఛ, అందరికీ న్యాయం సాధించడంలో యువత అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆచార్య పద్దయ్య, కె.వి.ఎస్.ఎన్.మూర్తి, మున్నార్, గోపాల్, రామేశ్వరి, అనిత, సూర్యనారాయణ, సత్యవతి, మంత్రి శ్యాంప్రసాద్, గౌరి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో రాణించాలి




రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కమల్‌బైడ్

మురళీనగర్ : విశాఖ జిల్లాలో సత్తా చాటిన వెటరన్ అథ్లెటిక్స్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలోనూ రాణించి విశాఖ కీర్తిని ఇనుమడింపచేయాలని వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా చీఫ్ ప్యాట్రన్ కమల బైడ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో వైశాఖి స్పోర్ట్సు పార్కులో పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14, 15న జరగనున్న 'ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంఫియన్‌షిప్ – 2024' క్రీడా పోటీల్లో ప్రతిభ చాటాలన్నారు. విశాఖ వెటరన్ అథ్లెట్స్ కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి క్రీడాకారులకు సహకారం అందిస్తామని ప్రకటించారు. అనంతరం క్రీడాకారులకు ఆయన సొంత నిధులతో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. క్రీడాకారులకు పూర్తి సహకారం అందిస్తామని జనకులం ఫౌండేషన్ అసోసియేషన్ న్యూ చీఫ్ అడ్వైజర్ చింతలపాటి సత్యదేవ్ ప్రకటించారు. సొసైటీ న్యూ కోఆర్డినేటర్ సీహెచ్.శ్రీనివాసరాజు ప్రసంగించారు. కార్యక్రమంలో ఫిల్మ్ డైరెక్టర్ యాద్ కుమార్, అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మంగా వరప్రసాద్, కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు, కో ఆర్డినేటర్ సీహెచ్.శ్రీనివాసరాజు, వంశీ, జాతీయ అథ్లెట్స్ డాక్టర్ ప్రభుదత్, డి.సరోజిని, డైరెక్టర్స్ కె.జి.మోహన్, ఎస్.ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

పాలకులకు మంచి ఆలోచనలు కలగాలి

- త్రిదండి చిన్న జీయర్ స్వామి
- వైభవంగా శ్రీరామ పాదుకా ఆరాధన



ప్రసంగిస్తున్న త్రిదండి చిన్న జీయర్‌స్వామి

సీతమ్మధార : దేశ, రాష్ట్ర అభివృద్ధి కోసం పాలకులకు మంచి ఆలోచనలు కలగాలని భగవంతుని ప్రార్థిద్దామని త్రిదండి చిన్న జీయర్ స్వామి పిలుపునిచ్చారు. సీతమ్మధారలో శ్రీరామ పాదుకా ఆరాధన పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. గీతా జయంతి వేడుకల్లో భాగంగా ఆయన అనుగ్రహభాషణం చేశారు. అనంతరం భక్తులతో స్వయంగా శ్రీరామ పాదుకా ఆరాధన పూజలు నిర్వహించారు. జీయర్ స్వామి స్వయంగా భక్తులు అందరికీ శ్రీరామ పాదుకలు అందించి, శ్రీరామ సహస్ర నామాలతో పూజ చేయించారు. దేశం, రాష్ట్రం అభ్యున్నతి కోసం మన వంతుగా స్వామిని ప్రార్థిద్దామన్నారు. అంతకు ముందు కోలాటం, భజనలు, వేద పారాయణతో భారీ ఊరేగింపుగా శ్రీరామ పెరుమాళ్‌ను ప్రవచన మండపంలోకి జీయర్ స్వామి తీసుకొచ్చారు.

మానవ జీవితానికి లక్ష్యం అవసరం

కేవలం తినడం కోసమే ఉపయోగపడే చదువు దండగ అని, మానవ జీవితానికి ఒక లక్ష్యం ఉండాలని త్రిదండి చిన్న జీయర్ స్వామి సూచించారు. కేవలం తినడమే లక్ష్యమైతే మనిషికి, ఇతర జీవులకు తేడా ఉన్నట్టా ? లేనట్టా అని ప్రశ్నించారు. మనం అభ్యసించే విద్యకు ఒక పరమావధి ఉండాలన్నారు. గతంలో గురుకుల, ఆశ్రమ విద్యా విధానం ద్వారా ఎంతో ఉన్నత విజ్ఞానం సంపాదించడంతోపాటు, సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేదన్నారు. మందులు వాడాల్సిన అవసరం లేని సమాజం కోసం మనిషి విజ్ఞానం వాడాలని జీయర్ స్వామి సూచించారు. చదివిన చదువుకు ఒక లక్ష్యం ఉండాలని, ఆదాయం సంపాదించడమే ముఖ్యం కాకూడదన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ఎస్ఆర్ వర్మ, వారీజ వేద పాఠశాల అధ్యాపకులు ముడుంబై శ్రీకాంత్ స్వామి, సంతోష్ కుమార్ స్వామి, సభ్యులు ఎంఎస్ రాజు, కాశీ రాజు, సాతులూరి రామానుజం, నారాయణ రెడ్డి, నేత్ర విద్యాలయ నిర్వాహకులు శిరీష, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠన పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

విశాఖ విద్య: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత పఠన పోటీల్లో శాంతినగర్‌లో ఉన్న శ్రీ రామకృష్ణా పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటుకున్నారు. 7,8,9 తరగతులు చదువుతున్న విద్యార్థినులు పాల్గొని ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. లక్ష్మీ నళిని పేర్కొన్నారు. ఈ పోటీల్లో సుమారు 54 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఎ. విజయలక్ష్మి శిక్షణ ఇచ్చారు.

చెస్ విజేతలకు బహుమతులు



మెమెంటోలతో చెస్ విజేతలు

కంచరపాలెం : జీవీఎంసీ 57వ వార్డు ఊర్వశి కూడలి సుభాష్‌నగర్‌లో జ్ఞానసాయి చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చెస్ పోటీల్లో విజేతలకు రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్ బాబు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. చెస్‌తో చిన్నారుల మేధోశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో చెస్ నిర్వాహకులు సూర్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

ఆటో అప్పగింత



యజమానికి ఆటో అప్పగిస్తున్న క్రైమ్ పోలీసులు

గోపాలపట్నం: ఇటీవల దొంగతనానికి గురైన ఆటోను ఎయిర్‌పోర్టు క్రైమ్ పోలీసులు పట్టుకుని ఆటో యజమానికి ఆదివారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన జి. సంతోష్ ఈ నెల 5న ఇంటి వద్ద రాత్రి సమయంలో తన ఆటో (ఏపీ 31టీపీ 1419)ని పార్క్ చేశాడు. ఉదయం లేచి చూసేసరికి ఆటో లేకపోవడంతో ఎయిర్‌పోర్టు క్రైమ్ పోలీసుకు ఫిర్యాదు చేశాడు. వెస్ట్‌జోన్ క్రైమ్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ నరేష్‌కుమార్, కానిస్టేబుల్ జానకిరామ్, హోమ్‌గార్డు ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. దొంగిలించబడిన ఆటోను నరసింహనగర్ వద్ద గుర్తించారు. దాన్ని స్వాధీనం చేసుకుని సీఐ ఆదేశాల మేరకు ఆటో యజమానికి అప్పగించారు. దర్యాప్తులో ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బందిని సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

అక్కిరెడ్డిపాలెం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గాజువాక పోలీసులు పట్టుకున్నారు. గాజువాక సీఐ ఎ.పార్థసారథి ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్కాపురానికి చెందిన అచ్చిబాబు అనే వ్యక్తి వ్యానులో సుమారు రెండు టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని సబ్బవరం తరలిస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. వ్యాను మింది గ్రామం నుంచి వెళ్తున్నట్లు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రాధాకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేసి వ్యానుతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

చైల్డ్‌లైన్‌కు బాలిక అప్పగింత



బాలికతో షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి

సీతమ్మధార: వన్‌టౌన్ ఏరియాలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ దగ్గర రెండు రోజుల నుండి హాసిని (7) ఒంటరిగా కూర్చుని ఏడుస్తూ ఉంటే పెట్రోల్ బంక్ సిబ్బంది ద్వారకా నగర్ లోని ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్‌కు సమాచారం అందించారు. దీంతో షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి అక్కడికి వెళ్లి బాలికను కలుసుకున్నారు. తిండి లేక నీరసించిపోయిన పాపకు మంచినీరు, అల్పాహారం అందించారు. అనంతరం టీఎస్సార్ మహిళా షెల్టర్ హోంకు ఆదివారం తీసుకొచ్చారు. బాలిక అమ్మ చనిపోయిందని, తండ్రి చెత్త ఏరుకుని వచ్చిన డబ్బులతో బాగా తాగి తనను కొడుతున్నాడని పాప తెలిపింది. రాత్రి ఒంటరిగా వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయాడని చెప్పింది. పాప తదుపరి సంరక్షణ కోసం 1098కి ఫోన్ చేసి చైల్డ్‌లైన్ సిబ్బంది ప్రశాంత్‌కు అప్పగించారు.

వాకర్స్ క్లబ్ అధ్యక్షునిగా భానుప్రకాష్



మురళీనగర్ వాకర్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా సనపల భానుప్రకాష్ ఎన్నికయ్యారు. అందరూ విద్యావంతులు, మేధావులుగా కీర్తించబడే వాకర్స్ క్లబ్ సభ్యుల్లో ఎక్కువ శాతం ఓటు హక్కు వినియోగించుకోకపోవడం గమనార్హం. మొత్తం 877 మంది సభ్యులు ఉండగా వీరిలో 262 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. అంటే కేవలం 29.87 శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. కనీసం 50 శాతం మంది కూడా ఓటు వేయకపోవడం గమనార్హం.

ఉదయం నుంచి వాకర్స్ పార్కులో అభ్యర్థుల మద్దతుదారులతో కోలాహలం నెలకొంది. పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, వీఎంఆర్డీఏ మాజీ చైర్మన్ సనపల చంద్రమౌళి, తదితరులు ఓటు వేశారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సబ్బి రామ్మోహనరావుకు 123 ఓట్లు పడగా, సనపల భానుప్రకాష్‌కు 133 ఓట్లు వచ్చాయి. దీంతో భానుప్రకాష్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఓట్ల లెక్కింపు అనంతరం కమిటీ సభ్యులను ఎన్నికల అధికారి నిమ్మగడ్డ బుచ్చయ్య ప్రకటించారు. అధ్యక్షుడిగా సనపల భానుప్రకాష్, ఉపాధ్యక్షురాలుగా గొల్జాన విజయలక్ష్మి, కార్యదర్శిగా చొల్లంగి సత్యసూర్య వరప్రసాద రావు, సంయుక్త కార్యదర్శిగా నానుపాత్రుని ప్రకాశరావు, కోశాధికారిగా రోణంకి నాగేశ్వరరావు, జాలీ వాకర్‌గా నానుపాత్రుని మాధవి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా అట్లూరి వీరబాబు, బడాద శేఖర్, ద్వారపూడి సతీష్, గొల్జాన రామకృష్ణ, కొలుకులూరు వెంకట వర్మ, కోన శివరామకృష్ణ ప్రసాద్, మాచిరాజు నారాయణరావు, పైడి గిరిధరబాబు, సూరెడ్డి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలి



బైక్ ర్యాలీలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, కార్మికులు

సీతమ్మధార: ఎన్ఏడీలో 36 మంది కార్మికులను సస్పెండ్ చేసి, ఆరుగురిపై పోలీస్ కేసు పెట్టిన మేనేజ్‌మెంట్ ఏకపక్ష చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బి. గంగారావు అన్నారు. ఆదివారం ఉదయం ఎన్ఏడీసీఈ యూనియన్ దీక్షా శిబిరం నుండి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో గంగారావు మాట్లాడారు. విశాఖ చరిత్రలో ఏ పరిశ్రమలోనూ ఇంత మందిని సస్పెండ్ చేయలేదని చెప్పారు. ఎన్ఏడీ మేనేజ్‌మెంట్ సస్పెన్షన్లు, పోలీస్ కేసు ఎత్తివేసి, కార్మికుల కష్టార్జితం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే విశాఖలో ఉన్న ట్రేడ్ యూనియన్లతో పాటు రాజకీయ పార్టీలను ఐక్యం చేసి పోరాడుతామన్నారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి. కుమార్ మాట్లాడుతూ సస్పెన్షన్లు రద్దు చేయాలని రక్షణ మంత్రికి మెయిల్స్ పంపిస్తామని చెప్పారు.

పబ్లిక్ రంగ సంస్థల సమన్వయ కమిటీ కన్వీనర్ కుమార మంగళం, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కె. నాగార్జున, అరుణ్ శ్రీనివాసరావు, ఎంఈఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దీన్ అహ్మద్, జేసీఎం సభ్యులు భాను, శేఖర్ ఎన్ఏడీ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.